# 'ఆమె' లేఖలు

(1836-1839 మధ్య మద్రాసు నుండి రాసిన లేఖలు)

---


**జూలియా థామస్**

తెలుగు అనుసరణ

**పెన్నేపల్లి గోపాలకృష్ణ**

**కాళిదాసు పురుషోత్తం**



ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్ తో

**ఎమెస్కో**

# ఆమె

తన ఊరు పేరు చెప్పుకోకపోయినా, అనామకురాలు కాదు. పుట్టిందీ పెరిగిందీ, జీవితం అంతా గడిపిందీ ఇంగ్లండ్‌లో, కొంతకాలం మాత్రం ఇండియాలో ఉంది. ఆ కొద్ది కాలమే ఆమెను దాదాపు రెండు శతాబ్దాల పాటు చరిత్రపుటల్లో జీవింపజేసింది. ఆమె భర్త ఈస్టిండియా కంపెనీ హయాంలో ఆంధ్రదేశంలో జిల్లా జడ్జిగా పనిచేసిన 'తెల్లదొర'. ఆమె తన భర్తను చేరుకోడానికి 1836లో ఇంగ్లండ్‌లో ఓడ నెక్కి దాదాపు నాలుగు నెలల తర్వాత డిసెంబరులో మద్రాసు తీరంలో దిగింది. మద్రాసులో కొన్నాళ్లు, రాజమండ్రిలో చాలా కాలం, కొన్ని రోజులు బెంగుళూరులో గడిపి, 1840 జనవరిలో తిరిగి స్వదేశం వెళ్లిపోయింది. 'చుట్టపుచూపు'గా ఈ దేశం వచ్చి, ఇక్కడ గడిపిన మూడు సంవత్సరాలలో ఆమె చాలా విషయాలు గ్రహించింది. ఇక్కడి ప్రజల ఆచార వ్యవహారాలు, మంచిచెడులు, అలవాట్లు, మర్యాదలు, నమ్మకాలు, పిల్లల చదువు సాములు, సామాన్యుల జీవన విధానం, సామాజిక కట్టుబాట్లు, స్త్రీల పరిస్థితులు – ఇలా ప్రతి అంశాన్ని నిశిత దృక్పథంతోనేకాక, సానుభూతితో కూడా ఆమె పరిశీలించింది. మౌనంగా పరిశీలించడంతోపాటు, ఎప్పటికప్పుడు తన అనుభవాలను, అనుభూతులను ఇంగ్లండ్‌లోని తన సన్నిహితులకు ఉత్తరాలలో తెలియజేసేది. అలా ఆమె మొత్తం 27 ఉత్తరాలు రాసింది. ఎవరికి రాసిందో తెలియదు, ఎక్కడికి రాసిందో తెలియదు, తన ఊరూ పేరేకాదు, తాను రాస్తున్న ఊరూ పేరు కూడా రహస్యంగానే ఉంచింది. జాబుల్లో వచ్చే ఏ పేరూ నిజం కాదు. మొత్తం జాబుల్లో మొదటి నాలుగూ సముద్రయానం చేస్తూ రాసినవి. తర్వాత ఐదు లేఖలు మద్రాసు నుంచి, తక్కినవి రాజమండ్రి, ఆ పరిసరాల నుంచి, చివరి రెండు మూడు చిత్తూరు, బెంగుళూరు నుంచి రాసినవి.

## మొదటి లేఖ

### "మెడెయిరా అందమైన ప్రదేశం."

మొదటి నాలుగు ఉత్తరాలలో తన సముద్ర ప్రయాణం అనుభవాలు, అక్కడక్కడా తాను చూసిన ప్రదేశాలు, అక్కడి సంతలు, ప్రజల జీవనసరళి గురించి ఆమె ముచ్చటిస్తుంది. ప్రయాణం మొదలయ్యేనాటికి ఆమె గర్భిణి. ఆరోగ్యం ఏమంత బాగులేదు. కాస్త కుదుటపడగానే – 1836 ఆగస్టు 17వ తేదీన బే ఆఫ్ బిస్కేలో తొలి జాబు మొదలుపెట్టి, 25వ తేదీ డిసెంబర్‌లో పూర్తి చేస్తుంది. అందులో తన దినచర్యను వివరిస్తూ – "రాత్రి తొమ్మిదింటికే పడక, తెల్లారి ఐదయ్యేసరికి కోళ్లు, కుక్కలు, పిల్లులు, పందుల బృందగానంతో మేలుకొలుపు. దానితోపాటు పసిపిల్లల ఏడుపులు, తల్లుల సముదాయింపులు. మరి కాసేపటికి నౌకర్లు కీచులాడుకోడాలు. ఇవన్నీ చూసి నవ్వే ఓపిక కూడా లేదు నాకు..." అంటుంది. ఉదయాన్నే ఐరిష్ పనిమనిషి కాల్చిన మాంసం, బంగాళాదుంపలు ప్లేట్‌లో పెట్టుకొని వస్తుంది. అది చూసి "ఏమిటి ? ఇదంతా నాకే" అని ఆమె ఆశ్చర్యపోతుంది. "అవునమ్మా! మీరు బాగా తినాలి. తింటేనే ఆరోగ్యంగా వుంటారు" అంటుంది పని మనిషి. తనకు కాస్త విసుగనిపించినా, పని మనిషి పుణ్యమా అని తన ఆరోగ్యం కాస్త మెరుగైనమాట వాస్తవమేనని ఆమె రాసింది.

ఆమె సోదరుడు 'ఫ్రాంక్' మెడెయిరా దాకా తోడువచ్చాడు. ఫ్రాంక్ సరదా మనిషి. ఓడలో అందరితో స్నేహంగా ఉండేవాడు. ఓడలో ప్రయాణిస్తున్న వారిలో సెయింట్ హెలీనాకు ప్రధాన న్యాయమూర్తి మిస్టర్ వైల్డ్, ఆయన భార్య, మిషనరీ మిస్ షీల్డ్స్, జబ్బుగా వుండే మిస్ వైట్, చెస్ ఆడే హార్వే, ఇంకా ఐరిష్ యువతులు, బైరన్ కవిత్వాన్ని అభిమానించే ఇద్దరు యువకులు, మాస్టర్ స్టీవెన్స్, అనే మరో మిషనరీ (చాలా మంచివాడు, కాస్త జబ్బుపడి ఇప్పుడిప్పుడే కోలుకొంటున్నాడు) ఉన్నారు. తీరంలో ఆగగానే అందరూ ఒడ్డుకు

చేరుకొంటారు. మెడెయిరా అందమైన ప్రదేశం, ఇటలీలా వుంటుంది. అక్కడ ఒక 'కన్యాగురుకులవాసా'న్ని (మొనాస్టరి) సందర్శిస్తారు. అందులోని సన్యాసినులు ఇనుపచువ్వల్లోంచి నవ్వుతూ మాట్లాడి పూలు అమ్ముతారు. వాళ్లకి పోర్చుగీసు తప్ప మరే భాషా రాదు. వాళ్లు చెప్పేది వీళ్లకి అర్థమైనా, వీళ్ల మాటలు వాళ్లకర్థం కావు. అందుచేత ఆ యినుప చువ్వలకు అటూ యిటూ ఊరికే తలలూపుతూ, స్నేహంగా ఒకర్నొకరు చూస్తూ వుండిపోతారు. ఫ్రాంక్ మెడెయిరా నుంచి తిరుగు ప్రయాణం కట్టాడు. అతను లేకపోవడం ఓడలో అందరికి లోటుగానే వుంది. ఓడ ఆ రాత్రే బయలుదేరుతుంది.

## రెండవ లేఖ

**29 ఆగస్టు, 1836**

"ఓడ వెన్నెల్లో చాలా అందంగా వుంది."

ఆగస్టు 29వ తేదీ మొదలు పెట్టి అంచెలంచెలుగా సెప్టెంబరు 3, 9, 24 తేదీల్లో రాసి, అక్టోబరు 15 నాటికి పూర్తి చేసింది. ఇకపై రోజూ ఒక ఓడ ఎదురవుతుంది గనక జాబులు పంపడానికి అనుకూలంగా ఉంటుందని కెప్టెన్ తెలియజేయడంతో అందరూ తమ ఇళ్లకు ఉత్తరాలు రాయడం మొదలుపెట్టారు. ఆమె కూడా అక్కడి వాతావరణాన్ని, వర్ణిస్తూ "మేమిప్పుడు ఉష్ణమండలంలో ప్రవేశించాం. చల్లనిగాలి వీస్తున్నది. వాతావరణం బాగుంది. ప్రయాణం బాగా సాగుతున్నది. రోజుకు సరాసరి 150 మైళ్లు వెళ్తున్నాం" అని రాస్తుంది. మెడెయిరాలో వున్నప్పుడు తాను చాలా బొమ్మలు గీసిందికానీ, వాట్ని పూర్తి చేయలేదు. పూర్తి చేద్దామంటే ఓపికలేదు. రెండు మూడు, తమిళపదాలు నేర్చుకొంది. సాధారణంగా ఓడల్లో స్త్రీలకు పనులుండవు. కబుర్లతో కాలక్షేపం చేస్తుంటారు. ఎండ తీవ్రంగా వున్నా, ఆమె క్యాబిన్‌లో మాత్రం చల్లగానే వుంది. సెప్టెంబరు 8వ తేదీ రాత్రి న్యూ సౌత్‌వేల్స్ నుంచి వెడుతున్న వేవ్ (Wave) అనే ఓడను దాటారు. అందులో వలస వెళ్తున్న జనం (సెట్లెర్స్)